నెట్‌ఫ్లిక్స్-బఫ్తా ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: కళలకు సంబంధించిన చారిటీకి పేరొందిన అంతర్జాతీయ సంస్థ లండన్‌కు చెందిన బఫ్తా .. 'బ్రేక్ త్రూ ఇండియా'పేరిట ప్రతిభాన్వేషణకు తెరదీసింది. నగరంలోని సినిమా, టీవీ, గేమింగ్ రంగాల్లో యువ ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు బఫ్తా, ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టి ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాయని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. యానిమేషన్, కొరియోగ్రాఫ్, సినిమాటోగ్రాఫ్, కంపోజింగ్, కాస్ట్యూమ్ డిజైనింగ్, డైరెక్షన్, ఎడిటింగ్, గేమ్ డెవలపింగ్, గేమ్ డైరెక్షన్-ప్రొడక్షన్, మేకప్ ఆర్టిస్ట్ వంటి అంశాల్లో రాణించాలనుకునే ఔత్సాహికులకు ఉచిత శిక్షణ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానం, అన్ని రకాలుగా మద్దతు అందిస్తామని తెలిపారు. అదనపు వివరాల కోసం www.bafta.org/supporting&talent/breakthrough సందర్శించాలని కోరారు.

డ్రాయింగ్ టీచర్ నరేందర్‌కు విశిష్ట పురస్కారం



దైవాజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరేందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సృజన ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో శనివారం పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న ఎల్.నరేందర్‌కు విశిష్ట పురస్కారం 2024ను ప్రదానం చేశారు. సరస్వతీ ఉపాసకులు దైవాజ్ఞ శర్మ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అనంతరం డ్రాయింగ్ టీచర్ నరేందర్ మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

నిర్భయంగా ఓటు వేయాలి



చిక్కడపల్లి సీఐ సీతయ్య

చిక్కడపల్లి: ప్రజలు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య హితవు పలికారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రచారం ముగిసినందున శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని, 14వ తేదీ ఉదయం వరకు వైన్స్‌లు, బార్‌లు బంద్ ఉంటాయని, నిబంధనలు ఉల్లఘించినవారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఓటర్లను డబ్బు, మద్యంతో ప్రలోభాలకు గురిచేస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఓటర్లు పోలీంగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్ తీసుకువెళ్లవద్దని, లోపలికి చిన్నపిల్లలను తీసుకుని పోకూడదన్నారు. వికలాంగులకు, వృద్ధులకు ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు చెప్పా. ఏదైనా సంఘటన చోటుచేసుకుంటే 100కు డయల్ చేయాలని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

నివాళి..



షబ్బీర్ అహ్మద్, బుర్ర రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అశోక్

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత షబ్బీర్ అహ్మద్, యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుర్ర రవి వర్ధంతిని శనివారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలోని టీఎంహెచ్‌ఈయూ కార్యాలయంలో నిర్వహించారు. దీనికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ హాజరై షబ్బీర్ అహ్మద్, రవి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ఫీవర్ శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు గోపి కృష్ణ, నళిని, మౌనిక, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా కూటమిదే గెలుపు'



సమావేశంలో మాట్లాడుతున్న కట్టెల సుభాష్ తదితరులు

నల్లకుంట: కేంద్రంలో ఈసారి ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని తెలిపారు. శనివారం నల్లకుంట తిలక్‌నగర్ చౌరస్తా సమీపంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సుభాష్ మాట్లాడారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్ రెడ్డి, జీబీ. శ్యామ్‌రావు, భూదాన్ సాగర్‌రెడ్డి, ఎడ్ల నరేందర్‌రెడ్డి, రామ్మోహన్, సీహెచ్ మురళీకృష్ణ, దేవిరెడ్డి విజితారెడ్డి, ఎన్.గిరి, బి.కాంతారావు, శరత్, విశ్వం, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



రేణుక(ఫైల్)

నల్లకుంట: మతిస్థిమితంలేని ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జె. శ్రీనివాస్ రావు తెలిపిన వివరాలు.. ప్రభుత్వ ఉద్యోగి గంగధార శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి నల్లకుంట మోరం క్వారీలేన్‌లో నివాసముంటున్నారు. మతిస్థిమింలేని ఆయన తల్లి రేణుక(43) ఈ నెల 4న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఆందోళన చెందిన శ్రీకాంత్ శుక్రవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... ఉందానగర్ – బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి(30) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ష్... గప్‌చుప్!

అంబర్‌పేట్‌లో ముగిసిన ప్రచారం

- బీజేపీకి అంబర్‌పేటపైనే ఎక్కువ ఆశలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే విస్తృత ప్రచారం
- కాంగ్రెస్‌కు సీఎం పర్యటన కలిసి వచ్చేనా?



అంబర్‌పేట: లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో హోరెత్తిన మైక్‌లు శనివారం సాయంత్రం 5 గంటల నుంచి మూగబోయాయి. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి వచ్చే అంబర్‌పేటలో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేశాయి. కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనాలు, కాలనీ అసోసియేషన్‌లతో భేటీలు, కార్నర్ మీటింగ్‌లు, బైక్, జీపు ర్యాలీలతోపాటు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంబర్‌పేటలో ఉన్న సుమారు 2.70 లక్షల ఓటర్లను ఆకట్టుకోవడానికి బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమదైన శైలిలో ప్రచార పర్వాన్ని సాగించాయి. హేమాహేమీలు ప్రచారానికి విచ్చేసి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు.

ఇక పోల్ మేనేజ్‌మెంటుపై దృష్టి..

ప్రచారం పర్వం ముగియడంతో అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంటుపై దృష్టి సారించనున్నారు. 48 గంటలపాటు పోలింగ్ బూత్‌లవారీగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఆయా పార్టీల బూత్ కమిటీల ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ఓటు వేసేలా ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్ల జాబితాలో ఉన్నా పేర్లను గుర్తించి వారు తమ పార్టీకి అనుకులమా, వారు ఎవరికి అనుకూలం అని పసిగడుతూ తమ వైపు ఎలా తిప్పుకోవాలని ప్రయత్నాల్లో మునిగిపోయారు. బస్తీల్లో ఓటర్లు ప్రత్యక్షంగా తాయిలాలు అందించి మెజార్టీ ఓట్లు కొల్లగొట్టేందుకు ఒకటి, రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

విస్తృతంగా బీజేపీ ప్రచారం

బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి అంబర్‌పేట నియోజకవర్గం సొంత గడ్డ కావడంతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అందరికంటే ముందుగానే కిషన్‌రెడ్డి, కాలనీ, అపార్ట్‌మెంటులు, బస్తీ అసోసియేషన్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు.

బీఆర్ఎస్ సహితం...

బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మెజార్టీ ఓట్లు అందించే పనిని భుజాన వేసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకోవడానికి వ్యూహాత్మకంగా తనదైన శైలిలో సమావేశాలు, ప్రచారపర్వాన్ని సాగించారు. అభ్యర్థి పద్మారావుగౌడ్ తరపున అన్నీతనై వ్యవహరించి మెజార్టీ ఓట్ల సాధనే లక్ష్యంగా పనిచేశారు.

కాంగ్రెస్‌కు సీఎం మీటింగ్ కలిసొచ్చేనా?..

అంబర్‌పేట కాంగ్రెస్ నేతల మధ్య సమన్వయం పెద్ద సమస్యగా మారింది. పాత, కొత్త నేతల మధ్య ఉన్న వర్గ విభేధాలు అంతర్గతంగా బయటపడ్డాయి. క్షేత్ర స్థాయిలో ప్రచారం పెద్దగా కనిపించ లేదు. సీఎం రేవంత్‌రెడ్డితో చేపట్టిన ప్రచారం, వేలాదిమందితో ర్యాలీ, కార్నర్ మీటింగ్ సక్సెస్ అయ్యాయి.

సమయస్ఫూర్తితో పరీక్షలు రాయాలి

ఐఏఎస్ అధికారి పవన్‌దత్తా



చిక్కడపల్లి: సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా సమయస్ఫూర్తితో పరీక్షలను రాయాలని ఐఏఎస్ అధికారి డాక్టర్ పవన్ దత్తా సూచించారు. సివిల్స్ అభ్యర్థుల కోసం అశోక్‌నగర్‌లోని అమిగోస్ ఐఏఎస్ అకాడమీ వారు శనివారం ఉచిత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌దత్తా మాట్లాడుతూ ప్రిలిమినరీ, మెయిన్స్ , ఇంటర్వ్యూ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి, రోజుకు ఎన్ని గంటలు చదవాలి అనే అంశాలను వివరించారు. దేశంలో జరుగుతున్న పలు పరిణామాల గురించి అభ్యర్థులతో ముఖాముఖి చర్చించి వారి సందేహాలు తీర్చారు. సాధించాలనే పట్టుదలతోపాటు క్రమపద్ధతి ప్రకారం చదివి ఆయా అంశాలను అవగాహన చేసుకుంటే ఇంటర్వ్యూ సమయంలో చాలా సమస్యలు తీరిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో అమిగోస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ రెడ్డి, చీఫ్ మెంటార్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్.. బీజేపీకి కంచుకోట: లక్ష్మణ్



ప్రచారం చేస్తున్న లక్ష్మణ్, సుప్రియానవీన్

కవాడిగూడ: సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం బీజేపీకి కంచుకోట అని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్‌లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా డివిజన్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి విజయం ఖాయమని అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచి కుమార్, బీజేవైఎం నగర కార్యదర్శి, అనిల్ కుమార్, మీడియా సెల్ ఇంచార్జి బిజ్జి కనకేష్ కుమార్, ఎన్నికల ఇంచార్జ్ రంగారెడ్డి, పార్టీ నాయకులు ఎం.నవీన్ గౌడ్, బిజ్జి రవి, నర్సింగ్ ప్రసాద్, అజయ్ గుప్తా, కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

గౌడ అభ్యర్థులను గెలిపించుకోవాలి: అంబాల



అంబాల నారాయణగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పార్లమెంట్ ఎన్నికల్లో గౌడ సామాజికవర్గ ఓటర్లు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న గౌడ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో గౌడల సమస్యలతోపాటు బడుగు, బలహీన వర్గాల గొంతుక వినిపించాలంటే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వారసత్వం పార్లమెంట్‌లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు బీఆర్ఎస్ తరపున సికింద్రాబాద్ నుంచి పోటీ చేస్తున్న పద్మారావుగౌడ్, భువనగిరి నుంచి పోటీ చేస్తున్న బూర నర్సయ్యగౌడ్‌లను అత్యధిక మెజార్టీలతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి: ముఠా గోపాల్



గాంధీనగర్‌లో బైక్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ



కాచిగూడ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు, దాసోజు

చిక్కడపల్లి: సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రజలను కోరారు. ఎన్నికల చివరి రోజు కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్‌కు మద్దతుగా శనివారం గాంధీనగర్‌లో బైక్‌ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకుడు ముఠాజైసింహ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్, ముచ్చకుర్తిప్రభాకర్, ఇన్‌చార్జీలు మాధవ్, బొట్టు శ్రీను, నాయకులు ముఠానరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ముఠాశివసింహ, శ్రీకాంత్, పున్నసత్యనారాయణ, పాశం రవి, ఎం.పద్మా, శ్రీధర్‌రెడ్డి, చాణిక్యరెడ్డి, నవీన్, డైనీయల్, ఎస్త్రీపేమ్, ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో బీఆర్ఎస్ బైక్ ర్యాలీ

కాచిగూడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కాచిగూడలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బీఆర్ఎస్ సిటీ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ పాల్గొని మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధికి చూసి ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేసి పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని కోరారు.

నియోజకవర్గాన్ని చుట్టేసిన కాలేరు

అంబర్‌పేట: అంబర్‌పేటలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ వస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఎన్నికల ప్రచారం చివరి రోజు నియోజకవర్గవ్యాప్తంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్‌లలో బైక్ ర్యాలీతో చుట్టేసి ఎన్నికల ప్రచారాన్ని ముగించారు. పార్టీ ఎన్నికల ఇంచార్జ్ దాసోజు శ్రవణ్‌కుమార్, కార్పొరేటర్‌లు బి.పద్మావెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్‌లతోపాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ ఖాయం



ప్రచారం చేస్తున్న కావ్యాకిషన్ రెడ్డి

కాచిగూడ: ఈసారి జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవటంతోపాటు ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ సాధిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి భార్య కావ్యా కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి డివిజన్‌లోని చెప్పల్‌బజార్, నింబోలి అడ్డ, కుద్బిగూడ, లింగంపల్లి, బర్కత్‌పుర, నారాయణగూడ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో లావణ్య, సారిక, వరలక్ష్మీ, కళావతి, తారా, శాంతాబాయి పాల్గొన్నారు.

ఓటు వేసిన యువతకు ఉచిత కరాటే శిక్షణ

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన యువతకు కరాటేలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమి డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి ప్రకటించారు. జీవీఆర్ కరాటే అకాడమి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు నెల రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి కరాటేలో ఉచిత శిక్షణ పొందాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తథ్యం: దానం



బర్కత్‌పురలో జరిగిన బైక్‌ర్యాలీలో పాల్గొన్న దానం నాగేందర్

కాచిగూడ: సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తథ్యమని ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం బర్కత్‌పురలో నిర్వహించిన బైక్ ర్యాలీలో దానం నాగేందర్ ప్రారంభించారు. ఓటు హక్కుల కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెల 13న పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తొలుపునూరి కృష్ణాగౌడ్, ఎడ్ల అభిజిత్ యాదవ్ దిలీప్‌కుమార్, నరేష్ గౌడ్, జెల్లి శ్రీమంత్‌గిరి, విజయ్‌కుమార్, భరత్ పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా..

కాచిగూడ: కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపిస్తేనే సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్ యాదవ్ అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్రమంత్రిగా, ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ ప్రజల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజలను విస్మరించిన కిషన్‌రెడ్డిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు శ్యాంరావు, దేవిరెడ్డి విజితారెడ్డి, తోట జగన్నాథం, ఎస్.గిరి, టి.శరత్‌బాబు, విశ్వేశ్వర్ రావు, రమణారెడ్డి, కె.శ్రీనివాస్, ఆంథోని, షైన్‌బాయి, వినోద్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు జనతాదళ్(ఎస్) మద్దతు

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి జనతాదళ్ (సెక్యులర్) పార్టీ బేషరతుగా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపాలని రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితులలో పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

స్వాగతం



అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ ఎన్నికల ప్రచారానికి నగరానికి విచ్చేయడంతో శనివారం ఎయిర్‌పోర్టులో ఆమెకు ఆ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి స్వాగతం పలికారు.